క్లుప్తంగా

బీఎస్ఎన్ఎల్ మేళాకు స్పందన


సిమ్‌ను అందజేస్తున్న వీర రాఘవయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక బస్టాండు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన బీఎస్ఎన్ఎల్ మేళాకు మంచి స్పందన వచ్చింది. బీఎస్ఎన్ఎల్ ఫ్రీ సిమ్‌లు, ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్ పోర్టబులిటీని టెలికం టెక్నీషియన్ వీర రాఘవయ్య వినియోగదారులకు ఇచ్చారు.

చెంగల్రాయరెడ్డి సేవలు మరువలేనివి


అన్నదానం చేస్తున్న అంజూరు శ్రీనివాసులు, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్ రెడ్డి

శ్రీకాళహస్తి : వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి పేదలకు చేసిన సేవలు మరువలేనివని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ కూడలి వద్ద వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు నివాళులర్పించారు. తారక శ్రీనివాసులు మాట్లాడుతూ చెంగల్రాయరెడ్డికి పదిమందికి సేవ చేయాలనే తపనతో ఉండేవారన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని తెలిపారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంతా ఉదయ్‌కుమార్, రత్నంరెడ్డి, గోపి, భరత్‌కుమార్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ వాసు రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శాస్త్రోక్తంగా సంకల్ప పూజలు


తాటిచెట్టుకు సంకల్ప పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం చుక్కాని ఉత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా సంకల్పపూజలు నిర్వహించారు. కార్తీక మాసం పౌర్ణమి రోజు రాత్రి చుక్కాని ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆలయంలో పెద్దనంది వద్ద సంకల్ప పూజలు చేశారు. అనంతరం తాటిచెట్టును నిలబెట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం


బుచ్చినాయుడుకండ్రిగ: తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం ఇస్తున్న మహిళ

బుచ్చినాయుడుకండ్రిగ: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని పార్లపల్లెలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులతోపాటు ప్రజలు కూడా సమస్యలపై అర్జీలు ఇచ్చారు. గ్రామంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతులను అందజేశారు.కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటల బీమా తప్పనిసరి

సత్యవేడు: రైతులు సాగు చేస్తున్న పంటలకు తప్పని సరిగా బీమా చేయించుకోవాలని ఏఈ మురళి కోరారు. శుక్రవారం వానెల్లూరులో సర్పంచ్ ఆశాలత అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై అధికారులకు 11 అర్జీలు అందాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై గ్రామసభలో రైతులకు అవగాహన కల్పించారు. వరి, వేరుశనగ, మామిడి పంటలకు మాత్రమే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం వర్తిస్తుందని, ఈ పంటలకు మూడు శాతం ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందని, మిగిలిన సొమ్ము ప్రభుత్వం చెల్లిస్తుందని ఏఈ చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎబినైజర్, రైతులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో పల్లెలు

- ఇళ్లలోకి విషపురుగులు
- స్తంభించిన రాకపోకలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్న పాడి రైతులు


శ్రీకాళహస్తి రూరల్: వరద నీటిలో అమ్మపాలెం

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని పలు గ్రామాలు రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని వరినారిమడులు నీట మునిగాయి. అమ్మపాలెం గ్రామం పక్కనే ఉన్న రెండు చెరువులు నిండి కలుజులు పారడంతో శుక్రవారం అమ్మపాలెం గ్రామాన్ని వరద నీరు ముంచెత్తింది. పొలాలు ఇళ్లు అనే తేడా లేకుండా వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట పొలాల్లోకి చెరువు నీరు చేరడంతో పొలాల్లోకి పూర్తిగా నీరు చేరాయి. పొలాలను దుక్కి దున్ని వరి నారుమడులు వేసి నాట్లు వేసే సమయంలో ఇలా నీరు రావడంతో నారు మొత్తం నీట మునిగి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోకి వచ్చే కాలువకు ఇసుక బస్తాలు వేసి నీటిని దారి మళ్లించేందుకు రైతులు ప్రయత్నించారు. వర్షపునీరు వల్ల విష పురుగులు ఇళ్లల్లోకి చేరుతున్నాయని గ్రామంలో ప్రస్తుతం దినదిన గండంగా గడుపుతున్నామని స్థానికులు వాపోతున్నారు. తక్షణం అధికారులు స్పందించి వరద నీరు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికుల కోరుతున్నారు.

స్తంభించిన రాకపోకలు

తుపాను ప్రభావంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రెండు రోజుల పాటు ఆగకుండా వర్షాలు పడడంతో పలు ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించిపోయాయి. విద్యార్థులు, రైతులు, ప్రైవేటు కర్మాగారాల సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. శ్రీకాళహస్తి–వెంకటగిరికి వెళ్లే మార్గంలో ముచ్చివోలు ప్రధాన రహదారిపై సున్నపు కాలువ ప్రమాదస్థాయిలో రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. తొట్టంబేడు మండలంలోని కాసరం, గుండెలుగుంట, చియ్యవరం, చోడవరం, అక్కుర్తి, ముచ్చివోలుతో పాటు వెంకటగిరికి వెళ్లే ప్రధాన మార్గం కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వంతెనపై రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. గత్యంతర లేక పలువురు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే వాహనాలు నీటిలో కొట్టుకుని పోయే పరిస్థితి నెలకొంది. వర్షాలుపడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి నెలకొంది. వరద నీరు తగ్గే వరకు పిల్లలు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి. రైతులు విధిలేని పరిస్థితుల్లో పాల క్యానులు తీసుకొని వరద నీటి ప్రవాహాన్ని దాటుతున్నారు. స్వర్ణముఖి పరీవాహక ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో గ్రామాల్లో రాకపోకలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంకటగిరికి వెళ్లే బస్సులు ఏర్పేడు మీదుగా అధికారులు దారిమళ్లించారు.

ఉధృతంగా గొడ్డేరు వాగు ప్రవాహం

సత్యవేడు: మండలంలోని పీవీపురం–నాగలాపురం మార్గంలో గొడ్డేరువాగు వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. విధిలేని పరిస్థితుల్లో కొందరు సాహసం చేసి వాగు దాటేందుకు ప్రయత్నించి ఇబ్బందులు పడుతున్నారు. 1991లో గొడ్డేరు వాగుపై లోలెవల్ బ్రిడ్జి నిర్మించారు. అయితే దాని వల్ల ఇక్కడి ప్రజల సమస్య తీరడం లేదు. హైలెవల్ వంతెన నిర్మిస్తేగానీ తొమ్మిది గ్రామాల ప్రజలకు సమస్య తీరదని స్థానికులు అంటున్నారు. వానాకాలం వస్తే తుపాను వర్షాలకు గొడ్డేరు వాగు ప్రవహిస్తే రాళ్ల వాగు ఉధృతంగా పారుతుంది. దీనిపై వంతెన నిర్మించకపోవడంతో పాండూరు–నాగలాపురం మార్గంలోని పీవీపురం, ఓబులరాజు కండ్రిగ, ఓబులరాజు కండ్రిగ గిరిజనకాలనీ, చమర్తికండ్రిగ, రేపల్లెవాడ, రాజగోపాలపుం, ఆనందాపురం ఎస్టీ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాగలాపురం వయా పాండూరు వరదయ్యపాళెం సర్వీసు రద్దు చేయడంతో డిగ్రీ విద్యార్థులు నాగలాపురం, పుత్తూరు కళాశాలలకు వెళ్లలేక ఇబ్బందులకు గురవుతున్నారు.


శ్రీకాళహస్తి రూరల్: ముచ్చివోలు గ్రామంలోని వరద నీటిలో పాలక్యాన్లు తీసుకెళ్తున్న రైతులు


సత్యవేడు: నిండుగా ప్రవహిస్తున్న రాళ్లవాగు


సత్యవేడు: ఓబులరాజుల కండ్రిగ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న గొడ్డేరు వాగు


శ్రీకాళహస్తి రూరల్: అమ్మపాలెంలో నీట మునిగిన నారుమడులు


శ్రీకాళహస్తి రూరల్: కాలువకు అడ్డుగా ఇసుక బస్తాలు వేస్తున్న రైతులు

2 వేల ఎకరాల్లో వరి పంట నష్టం

- కోతకు గురైన రోడ్లు

బుచ్చినాయుడుకండ్రిగ: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మండలంలో రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలు గ్రామాల్లో వరిపంట నీట మునకేసింది. భారీ వర్షానికి చెరువులు మొరవలు, కలుజులు పారుతున్నాయి. కాలువలు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. మండలంలోని కనమనంబేడు, పెద్దపాలేడు, జంబుగోళం, జీఎస్‌కండ్రిగ, ఆర్.అనంతాపురం, గాజులపెళ్లూరు, పార్లపల్లె, కాటూరు, నెలవాయి, కల్లివెట్టు, ఆలత్తూరు, పీవీకండ్రిగ గ్రామాల్లో సుమారు రెండు వేల ఎకరాలకు పైగా వరి పంట దెబ్బతింది. ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, జంబుగోళం, జీఎస్‌కండ్రిగ, పెద్ద పాలేడు, కొత్తకండ్రిగ, గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. కాళంగి నదిలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. చీటి కాలువ, కారణి వేరులో నీటి ప్రవాహం ఉధృతి మూలాన కారణి, కుకుంబాకం గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. చిన్న పాలేడు గిరిజన కాలనీలో పాపారాయుడుకు చెందిన పూరిల్లు వర్షాలు దెబ్బతిని, గోడలు పడిపోయి, కూలిపోయే స్థితికి చేరింది.


కూలే స్థితిలో ఉన్న పూరిల్లు


ఉధృతంగా ప్రవహిస్తున్న కాళంగి నది


బుచ్చినాయుడుకండ్రిగ: ఇది చెరువు కాదు.. నీట మునిగిన వరి పొలాలు


కనమనంబేడులోని పంట పొలాల్లో ప్రవహిస్తున్న కలుజునీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న చీటికాలువ

కలెక్టరేట్‌కు తరలిన పార్టీ శ్రేణులు



కలెక్టరెట్ నిరసన కార్యక్రమానికి వెళ్లిన ఏర్పేడు మండల నాయకులు

రేణిగుంట: 'అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమానికి రేణిగుంట, ఏర్పేడు మండలాల నుంచి శుక్రవారం పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో వెళ్లారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పిలుపు మేరకు ఏర్పేడు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కూనాటి రమణయ్యయాదవ్, రేణిగుంట మండలం అధ్యక్షులు గంగారి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జువ్వల దయాకర్ రెడ్డి, సర్పంచులు మునిశేఖర్ రెడ్డి, బాబ్జి రెడ్డి, శివయ్య, శంకర్ రెడ్డి, ప్రకాష్, ఏర్పేడు సింగిల్ విండో చైర్మన్ జనార్దన్ యాదవ్, మండల వైస్ ఎంపీపీ శ్రీనివాసయాదవ్, నాగార్జున రెడ్డి, సర్పంచులు శివయ్య, మోహన్ రెడ్డి, పెంచలయ్య, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

స్కిమ్స్ కళాశాలలో వర్క్ షాప్

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని కాపుగునేరి సమీపంలోని స్కిమ్స్ కళాశాలలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ వారు కోటక్ సెక్యూరిటీ సౌజన్యంతో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్ అనే అంశంపై రెండు రోజులపాటు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్క్ షాప్‌లో మ్యూచువల్ ఫండ్స్, ప్రైమరీ మార్కెట్స్, సెకండరీ మార్కెట్స్, ఇంపార్టెన్స్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్, ఫైనాన్షియల్ ఆపర్చునిటీస్, కెరియర్ ఇన్ సెక్యూరిటీస్ మార్కెట్స్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ వారు ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించి సర్టిఫికెట్స్ ఇచ్చారు. అనంతరం ఎన్ఐఎస్ఎమ్ అప్రూవల్ ట్రైనర్ డాక్టర్ బి నాగార్జునను కళాశాల అధ్యాపకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ గీతా దేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి


విద్యార్థులతో వర్క్ షాప్ ప్రతినిధులు

భరణి దీపోత్సవం


కొండపై దీపోత్సవంలో అర్చకులు

నారాయణవనం: తమిళ కార్తీక భరణి దీపోత్సవాన్ని మండలంలోని శైవ క్షేత్రాలలో శుక్రవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కైలాసనాథకోనలో కామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామికి ప్రత్యేక అభిషేకాలు, బిల్వ, కుంకుమార్చనలు చేశారు. జలపాతంలోకి భక్తులను అనుమతించలేదు. మహిళలు పిండిదీపాలు వెలిగించారు. సాయంత్రం ప్రదోష సమయంలో ఆకాశ దీపం వెలిగించారు. పాలమంగళం ఉత్తరపుకండ్రిగలోని పాలీశ్వరస్వామికి సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండదు

నారాయణవనం: సబ్ స్టేషన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం మండలంలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ జయప్రకాష్ తెలిపారు. సముదాయం, ఎరికంబట్టు, అరణ్యంకండ్రిగ సబ్ స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

శ్రీకాళహస్తి: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వేపోలీసుల కథనం మేరకు.. స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన రామయ్య కుమారుడు భానుతేజ బీటెక్ పూర్తి చేసి ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఇటీవల ఓ యువతితో ఫిబ్రవరిలో వివాహం నిశ్చయించారు. అయితే గత డిసెంబర్‌లో తల్లి మరణంతో భానుతేజ మనస్తాపానికి గురై ఉద్యోగాన్ని వదులుకున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సమీపంలో ఊరందూరు గేటు వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

సత్యవేడు: సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సహకరించాలని రైతులను ఏఈ ప్రభాకర్ రెడ్డి కోరారు. సాగునీటి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మంగళవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు, సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ మండలంలో 13 మైనర్ ఇరిగేషన్ సంఘాలు ఉన్నాయన్నారు. మదనంబేడు, శిరుణంబూదూరు పెద్ద చెరువు, శిరుణంబూదూరు చిన్న చెరువు, పేరడం, పీవీ పురం, రాజగోపాలపురం, పుదుకుప్పం, వీఆర్ కండ్రిగ, ఆంబాకం, దళవాయి అగ్రహారం, మదనంజేరి, కన్నావరంలో మైనర్ నీటి సంఘాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని 13 చెరువుల పరిధిలో 2,095 మంది రైతులు ఓటర్లుగా ఉన్నారని, వీరిలో పురుషులు 1577, స్త్రీలు 518 మంది ఉన్నట్టు చెప్పారు. ఎన్నికల అధికారులుగా ఐదుగురిని నియమించామన్నారు. సమావేశంలో పంచాయతీ రాజ్ ఏఈ పీ.ఇబ్రహీం ఖాన్, తెలుగుగంగ ఏఈ యూ వెంకటరమణ, ఎన్.రాజగోపాల్, ఓ.వెంకటేశం, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు,


మాట్లాడుతున్న ఇరిగేషన్ ఏఈ ప్రభాకర్ రెడ్డి

అంచనాలు సిద్ధం చేయండి

వరదయ్యపాళెం: వర్షాల కారణంగా మండలంలో జరిగే నష్టాలను క్షేత్రస్థాయిలో గుర్తించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించాలని సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి ఆదేశించారు. శుక్రవారం ఆమె మండలంలో పర్యటించారు. వరదయ్యపాళెంలో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన గోవర్ధనపురం వద్ద ఉన్న మారేడు కాలువ వంతెన, బీజీఆర్‌కాలనీ, కడూరు కూడలి వద్ద సున్నపు కాలువ, మత్తేరిమిట్ట ప్రాంతాలను సందర్శించారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమె వెంటతహసీల్దార్ రాజశేఖర్, ఎస్ఐ మల్లికార్జున్, అధికారులు ఉన్నారు.


గోవర్ధనపురం వంతెనను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్మయి

కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరదనీరు

నాగలాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం రాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టు నీటి మట్టం 31 అడుగులకు చేరుకుంది. ఈ నేపథ్యంలో అరణియార్ శాఖ అధికారులు ప్రాజెక్టు గేటును తెరిచి నీటిని విడుదల చేశారు.ఈ ప్రాజెక్టు నుంచి 5,600 క్యూసెక్కులు నీటిని విడుదల చేయడంతో నాగలాపురం మండలం ద్వారకానగర్ కాజువేపై నీరు ఉధృక్తంగా ప్రవహిస్తోంది. కాజువేపై నీరు భారీగా ప్రవహించడంతో కాజువేకు అవతల పిచ్చాటూరు మండలంలోని పలు గ్రామాలకు ప్రజలు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఎవరైనా కాజ్‌వేను దాటడానికి ప్రయత్నిస్తే వరద నీరులో కొట్టుకుపోయే ప్రమాదం ఉంటోంది. దీనిపై అప్రమత్తమైన ఉన్నతాధికారులు, పోలీసులు ఎవరూ కాజ్‌వేను దాటకుండా ఇరువైపులా ముళ్లకంచెలు వేశారు.

ఊంజల్ సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను చేశారు. ఉదయం 7 గంటలకు స్వామి వారికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలు పూర్తి చేశారు. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం అర్చకులు తిరుచ్చి వాహనంపై అమ్మవారిని సుందరంగా అలంకరించి అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఉయ్యాల సేవలో సేదదీరారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ఊంజల్ సేవలో పద్మావతీ అమ్మవారు